రచన - మే 1992

# ఇంతేలే! ఈ కథింతేలే!

మన ఆలోచనలన్నీ సక్రమమైనవనీ, సజావయినవనీ ఘంటా భజాయించి చెప్పలేం! అలాగే వాటిని, అవి అర్థవంతంగా లేవనీ దారీతెన్నూ లేనివని ఆపనూలేం. ఇవన్నీ తెలిసున్నా, ఒక్కసారి మనవాళ్ళన్నవాళ్ళు పొరబాట్లు చేస్తూ వుంటే, మన హెచ్చరికలు ఏమాత్రం పట్టించుకోకపోతే మనకి మొదట ఉక్రోషం వస్తుంది. ఆ తర్వాత అది కోపంగా మారి ఉండుండి ఉద్ధృతరూపం దాలుస్తుంది. మనల్ని ఆటుపోటులకు గురిచేస్తుంది.

నిజమే, అందుకే కాబోలు, సైకియాట్రిస్ట్‌లు - సముద్రాలలో మాదిరి శరీరంలో కూడా సాగర మథనాలు తప్పవని అంటారు.

మామూలుగా అయితే ఈ పై ఆలోచన వచ్చేది కాదు. జయ వచ్చి రవి గాడు రహస్యంగా కుముదిని అనే అమ్మాయి గురించి తనతో చెప్పడం, అంతట ఆమె, ఏదోకథ వింటోన్న దాని మల్లే ఊకొట్టడం, దాంతో సుపుత్రుడు మరికొంచెం ముందుకు వెళ్ళి ఆ అమ్మాయి తోడిదే తన లోకంగా అన్పిస్తూన్న విషయం నాకు విన్నవించమని ప్రాధేయపడ్డం గబగబా జరిగిపోయాయిట. ఈవిడగారేమో మధ్యవర్తిగా తానా పని చేయలేనని అనడం, వెంటనే రవి మొదటి మెట్టుగా తల్లిగారి చేతులూ, ఆ పైన సాష్టాంగ ప్రమాణం చేసేసి, పాదాలు రెండూ పట్టేసుకుని వదలననడం - అన్నీ నాకు పూస గుచ్చినట్టు చెప్పింది. పైగా అంతటితో తన కర్తవ్యం పూర్తి అయ్యిందన్న సూచనగా ఓ వేడి నిట్టూర్పు విడిచి, చటుక్కున పక్క గదిలోకి కనుమరుగవుదామని చూస్తోంది, జయ. అన్నీ నేను గమనిస్తూనే ఉన్నాను.

అందుకే "ఇటురా" అన్నాను. ఆ మాట నా నోట్లోంచి మృదువుగా రాలేదని నాకు తెలుసు. "వాడు నీతో చెప్పింది, నువ్వు నాకు టేప్ రికార్డర్ అయి విన్పించావు. అంతే కాని ఓ తల్లిగా బాధ్యత పట్టవల్సిన మనిషిలా నువ్వు ప్రవర్తించలేదని నా అనుమానం" అనేశాను.

జయ ఏమనుకుందో, మిట్టమధ్యాహ్నపు ఎండను చూసినట్టు కళ్ళు చిట్లించి, "అంటే నేను తలుపు పక్కన ఉన్న చీపురు కట్టనో, ముక్కాలి పీటనో ఎత్తలేదంటారు. అదే కదా మీ ఉద్దేశం?"

"నువ్వలా చేసి వుంటే ఈ వ్యవహారం వంటింటిని దాటి నా గది దాకా వచ్చేది కాదు..."

"ఇంతకీ ఏమంటారు?"

"వాడు పెద్దాడు అయిపోయాడు. మీసాలు వచ్చాయి. అవి ముదురుతున్నాయి. ఇంజనీరింగ్ కూడా అయిపోయింది. ఉద్యోగం దొరక్క పోదనే ధీమాతో వాడిలా పేట్రేగుతున్నాడులా వుంది...."

జయ "ఏం మాటలండీ అవి" అని ఆ పైన నవ్వబోయి, అది ఆపుకుని, "మీతో ముప్ఫై ఏళ్ళు సంసారం చేసిన మూలంగా, మీ మాటలూ పద్ధతులూ అన్నీ నాకు గుర్తే. మీ ఊహలకు కళ్ళేలు వుండవనీ, మీ మాటలు అక్షయతూణీరంలోంచి వచ్చే వాడి బాణాలనీ ఎంత తెలిసినా నేను తరచు ఉక్కిరి బిక్కిరి అవుతూనే వుంటాను. వాకిట్లో వాయుగుండం, పడగ్గదిలో పెనుతుఫాన్లూ, అంతలోనే అన్నీ తీరం దాటిన తరువాతి ప్రశాంతత, ఎన్ని అనుభవాలు మీతో... కానీ వాడు చిన్నవాడు. లేత వయసులో చిన్న చిన్న తప్పటడుగులు వేస్తే అందుకు బహుమానంగా ఎదురు దెబ్బలు తినవల్సి వస్తుందని ఇంకా ఎరగనివాడు.

ఆతృతతో ఎగిరి గంతులు వేయడం, ఆవేశాన్ని అదుపు చేసుకోలేక దాని చుట్టూ ఇట్టే గాలి మేడలు కట్టేసుకోవడం మాత్రమే తెలిసినవాడు. కాదంటారా?"

అంటూ ఏవేవో యక్ష ప్రశ్నల్ని నా మీదకు గుప్పించింది.

"చాల్లే...." అనేశాను.

"నా వైపు నుంచి ఇక చెప్పేదేం లేదని నేను పులిస్టాప్ పెట్టేద్దామనుకుంటున్నాను. మీరే అందుకు గ్రీన్ సిగ్నల్ యిచ్చేశారు. బావుంది.. చాలాసార్లు మనిద్దరం ఒకే మాట మీద నిలబడలేక మాటా మాటా అనుకోవడం, ఆపైన ఆ వాదన ముదిరి ముదరపాకాన పడకుండానే చప్పున మేల్కొవడం మనకు మామూలేగా..." అంటూ మరో మాట నా నోటి నుంచి రాకుడానే, అది వినే అవకాశం ఎక్కడ కలుగుతుందో నన్నంత వేగంగా కాలికున్న వెండి పట్టాల తాలూకు ముత్యాల సవ్వడిని ఆ ప్రాంతంలో ఒదిలి పక్క గదిలో పత్తా లేకుండా పోయింది!! అయినా నా మనసు పరిపరి విధాల పరిభ్రమిస్తోనే వుంది...ఓ గంట తర్వాత దాన్ని లొంగదీసుకున్నాను.. 'చూస్తాను' అని అనుకుంటూనే మీసాల మీద చెయ్యి వేశాను.

❖ ❖ ❖

అప్పుడు కుముదిని క్లాసురూంలో ఉంది. తెలుగు లెక్చరర్‌గారు ప్రాచీన సాహిత్యం మీదా, అందునా అభిజ్ఞాన శాకుంతలంలో కాళిదాసు గారి కలం పోయిన పోకడల గురించి తన్మయత్వంతో ఓ విధమైన అభినివేశంతో వివరణలు ఇస్తున్నాడు.

ఇంతలో బయటినుంచి ఫ్యూన్ ఓ కాగితం తీసుకువచ్చి లెక్చరర్‌కి యిచ్చాడు. "కుముదినీ, నీ గురించి ఎవరో వచ్చి బయట ఎదురు చూస్తున్నారుట, నువ్వు వెళ్ళచ్చు" అన్నాడు. కుముదిని సహజంగా ఆశ్చర్యపడి, ఆ పైన నిశ్శబ్దంగా క్లాసు లోంచి బయటకు వెళ్ళింది. బయట వరండాలో ఎవరో పెద్దమనిషి నుంచుని కన్పించాడు. గాస్కో పంచి, పైన పొట్టి చేతుల ఖద్దరు చొక్కా, భుజాన, ఆకుపచ్చా, ఎరుపు రంగుల కలయికలతో పేర్చిన కండువా, కళ్ళ మీద చత్వారపు జోడు, మనిషి మీద దాడి చేస్తూన్న పెద్ద వయసు తాలూకు ఆనమాల్లు కన్పిస్తూనే వున్నాయి. ఆయన కుముదినిని చూసి "నీ పేరు కుముదినా" అని అడిగాడు. కుముదిని తల వూపింది.

"నేనే నమ్మా నీ గురించి వచ్చింది..."

"మీరు...?"

"అసలు, ఇలా మీ కాలేజీకి వచ్చి నీతో మాట్లాడవల్సి వస్తుందని అనుకోలేదు. తీరిగ్గా సాయంత్రమే ఇటు వచ్చి నిన్ను పట్టుకోవాలనుకున్నాను. కానీ చత్వారం మూలంగా రోడ్లు క్రాస్ చేయడం ఒక ఇబ్బంది. కళ్లజోళ్ళోంచి –మీ అలంకరణల్లో వస్తున్న మార్పుల మూలంగా నీ బదులు ఏ అబ్బాయిల వెంట బడతానో నన్న అనుమానంతో ఇలా చేశాను.."

కుముదిని మళ్ళీ, "ఇంతకీ మీరెవరో" అని వాక్యం పూర్తి చేయకుండానే, ఆయన

మధ్యలోనే అందుకుని, "చెప్పలేదు కదూ, నాతో కాసేపు మాట్లాడావంటే నేనెవరయిందీ నీకే తెలుస్తుంది" అని ఓ సారి పక్కకి చూసి, "ఆ బెంచీ మీద కూర్చుందాం, లేదంటావా బయటకి వెళ్ళి మాట్లాడుకుందాం అంటే – నీ ఇష్టం...".

ఇద్దరూ గన్నేరు చెట్టుకింద ఎండుటాకుల్ని మోస్తున్న పాత సిమ్మెంట్ బెంచీ దగ్గరకు వెళ్ళారు. కుముదిని తన చేత్తో ఆకుల్ని క్రిందకు తోసింది. ఆ పైన ఓ విధమైన సందేహంతో మరికొంచెం బెదురుపాటుతో కాలేజీ మెయిన్ గేటువైపూ, చుట్టుపక్కలా చూస్తోంది. ముక్కూ మొహం తెలియని మనిషితో, అదీ వయసు మళ్ళిన పెద్దమనిషితో పక్కన కూర్చుని పైగా ఆయన ఏ విషయం మీద తనతో మాట్లాడతాడోనని లెఖ్ఖలు వేసుకుంటూ జవాబులు ఎలా చెప్పాలో ప్రిపేర్ అవుతోంది!

ఆయన మొదట కుముదిని కుటుంబ సభ్యుల గురించీ వారి సంఖ్య గురించీ అడిగాడు. కుముదిని మామూలుగా జవాబులు చెప్పేసింది. అప్పుడు ఆయన "అయితే" అని ఓ క్షణం ఆగిపోయి, 'అవన్నీ ఎందుకులే, సూటిగానే మాట్లాడుకుంటేనే పోతుంది' అని తనలోనే అనుకుని, "సరే నీకు రవి తెలుసుననుకుంటాను... బి.ఇ. ఎలక్ట్రానిక్స్ ఈ మధ్యే పాసయ్యాడు. సిద్ధార్థ కాలేజీ స్టూడెంట్. బక్కపలచగా వుంటాడు. పడమట నుంచి వస్తాడు. తెలుసు కదూ.." అడిగాడు.

కుముదిని కాసేపు మౌనంగా వుండి, తలవంచుకుని, "తెలుసు" అంది.

"అతగాడు నీకు బాగా తెలుసుననీ, మీ ఇద్దరి మధ్యా పరిచయం ఒక్కటే కాకుండా, చిలవలూ పలవలూ వేసిన స్నేహం కూడా ఉందని..."

"అంకుల్, మీరు నా పర్సనల్ విషయాలు అడుగుతున్నారు, సారీ" అంది అనీజీగా మొహం పెట్టి కుముదిని.

ఆయన నవ్వేశాడు. "స్వంత విషయాలంటే మనసనే గూడులో కళ్ళు తెరవకుండా వుండే పక్షి పిల్లలాంటివి. అంత పదిలంగా వుంటాయన్న మాట! అవి ఎప్పుడయితే స్వంతం దగ్గర ఆగకుండా ముద్దుముద్దుగా హద్దులు దాటి, ఆ పైన మరొకరి సరిహద్దుల్లో మకాం పెడతాయో వాటికి వెంటనే పబ్లిక్ ఇంపార్టెన్స్ వస్తుంది... కాదంటావా?"

కుముదిని అటూ ఇటూ చూసి, "నా స్వవిషయాలు నేను మరొకరితో చర్చించడానికి ఇష్టపడనంత కాలం, అవి ఎక్కడ వాలినా, అవి నా పెర్సనల్ ప్రోపర్టీ అవుతాయి కదా" అంది ధీమాగా.

"ఆహా..." అన్నాడు, 'అమ్మాయి నీకు చాలా తెలివితేటలు ఉన్నట్టున్నాయే' అనే వ్యంగ్యం రెండక్షరాల ధ్వనిలో జతకలిపి!!

"మీరు అడగదల్చుకున్నది రవి గురించి, మా స్నేహం గురించి అదీ కాదు – అతను నేనంటే నూ నేను అతనంటేను ఇష్టం పడ్డం మీకు ఇష్టం లేక – అవునా?"

"అవును..."

"మీకు రవితో ఉన్న సంబంధం ఏమిటో తెలియకుండా మరిన్ని వివరాలూ విశేషాలూ మీతో మాట్లాడ్డం బావుండదు కదండీ? కనీసం మీరు నాకు బంధువయినా, లేక మీరు రవిగారి తండ్రో, గార్డియన్ లాంటి మనిషో అయితే...." కుముదిని ఆగిపోయింది...

"నేనెవర్నో చెబితే నువ్వు బాధపడతావు. నా వివరాలు అన్నీ విని బెదిరిపోతావు. అందుకే సూచనగా చెప్తున్నాను. అన్ని కథల్లోలాగా ఈ కథలో కూడా ఒక అబ్బాయీ, ఇద్దరు అమ్మాయిలూ ఉన్నారు. ఆ అబ్బాయిని వీళ్ళిద్దరూ ప్రేమించడం, ఆ పైన ఇద్దరూ కూడబలుక్కుని ఒకళ్ళు త్యాగం చేస్తే మరొకరు ఆలిగా మారడం పాతకథ. కానీ ఆ అబ్బాయి ఒకరికి తెలియకుండా మరొకర్ని ప్రేమిస్తూ అలాగే కాలం వెళ్ళదీస్తూ ఆఖరికి ఇద్దర్నీ మోసం చేశాడనుకో. అమ్మాయిల కథ అప్పుడు ఏ మలుపు తిరుగుతుందంటావ్? ఇది కథ కాకూడదని, నాలాంటి వాడెవడో ముందుకు వచ్చి ఇద్దరి అమ్మాయిల కళ్ళూ తెరిపించి ఆ పైన తను పుణ్యం మూట గట్టుకోవాలని ఆశపడితే తప్పా? ఇది సంఘసేవా, ప్రజాసేవల కిందకి రాదా?... తెలివయినా వాళ్ళూ, మేధావులూ దేశంలో జరిగే అన్యాయాల్ని చూస్తూ ఊరుకుంటున్నారనే వాదనతో ఏకీభవించలేక నేనీ పనికి పూనుకోవడంలో అన్యాయం ఏమిటి?"

ఆయన గుక్కతిప్పుకోకుండా చెప్పి, కళ్ళజోడు చేతిలోకి తీసుకుని కండువా అంచులతో మొహం తుడుచుకున్నాడు.

కుముదిని అంతా విని, "మీ మాటలన్నీ అబద్ధాలనీ, మీరు ఇవన్నీ కావాలని చెప్తున్నారనీ నేనన్నా ననుకోండి? మీ దగ్గర ఏం సమాధానం వుంది. పైగా నేను మిమ్మల్ని రవి తండ్రి అంటాను. మీరు మా మధ్య ఓ పెద్ద అగాధం సృష్టించడానికి తయారయి వచ్చారని అంటాను...అప్పుడు?" అన్నది.

ముసిలాయన తల మీద కొట్టుకుని, "రామ రామ రవి నాకు ఏమీ కాదమ్మా ఒట్టు వాడు పరమ రోగ్.... ఆ విషయం తెలియక మా అమ్మాయి వీణ కూడా వాడి వలలో పడింది. దానికి నీ విషయం చెప్పాను. మీరిద్దరూ వాడి బారి నుంచి రక్షింపబడాలి. అది వాడి మైకంలో నిలవెత్తు మునిగింది. నువ్వోసారి మా ఇంటికి వచ్చి దానికి నచ్చజెప్పు. లేక మీరిద్దరూ ఏం మాట్లాడుకున్నా నా కిష్టమే. నీకు వీలవుతుందంటే రేపు ఇదే సమ యానికి ఇక్కడికి వస్తాను. నాతో మా ఇంటికి వస్తావా?" అడిగాడు.

కుముదిని ఆయన వైపు చూసి ""మీ యడ్రసూ, పేరూ అన్నీ ఓ కాగితం మీద వ్రాసి యివ్వండి. వచ్చే శుక్రవారం నాకు కాలేజీకి ఫోన్ చెయ్యండి మరి మనం లేద్దామా ఇప్పటికే మరో పీరియడ్ కూడా అయిపోయింది. ఇంకా ఇలా మనిద్దర్నీ మా ఫ్రెండ్స్ చూశారంటే ఇంకేం లేదు" అనేసింది.

"నా పేరు రామలింగం, తల్లీ.... ఇదిగో యడ్రసు... నిజమే నువ్వు చెప్పింది ... నీకే కాదు నాకూ ఇబ్బందే. ఈ సీను యధాతథంగా మా ఇంట్లో మా ఆవిడ విందంటే –

అడగొద్దు రోజులలా ఉన్నాయి.” అంటూ నవ్వేశాడు.

కుముదిని రామలింగాన్ని వెళ్ళనిచ్చి ఏదో ఆలోచించి, మొదట ఓ కాలు క్లాసు వేపూ, మళ్ళీ ఆలోచించి మరో కాలు కాలేజీగేటు వేపు వేసి, ఓ క్షణం ఆగి, చిన్ననిట్టూర్పు విడిచి ఆ బెంచీ మీదోసారి కూర్చుని తల సవరించుకుని హెయిర్ కూంబ్ చేసుకుని కాలేజీ బయటకు బయల్దేరింది. ఆ తర్వాత పబ్లిక్ బూత్‌లోకి వెళ్ళి రవికి ఫోన్ చేసింది. అవతలి నుంచి ‘రవి మాట్లాడుతున్నాను’ అనే సమాధానం విని, “నేను కుముదినిని” అని, వేరేం మాట్లాడకుండా “రవీ, మీ నాన్నగారు ఎలా వుంటారు?” అంటూ ప్రశ్నించింది. అవతలి నుంచి ఏ జవాబు వచ్చిందో తెలియదు గాని, కుముదిని మళ్ళీ, “జోకులు వెయ్యద్దు రవీ.... సీరియస్‌గా అడుగుతున్నాను” అంది.

అవతలి నుంచి సమాధానం వచ్చింది. కుముదిని కాసేపు అలాగే ఉండిపోయి, ‘హలో’, ‘హలో’ అనే పదాలు తన చెవిని హోరెత్తిస్తున్నా లెఖ్ఖ చేయకుండా చేతిలో క్రేడిల్‌ని హుక్ మీద అంతకుమించి బలంగా కొట్టలేనంత స్పీడ్‌తో పెట్టింది. తద్వారా తన మనసుకు తగిలిన గాయం రవికి అర్థమవ్వాలని!

❖ ❖ ❖

నేను గుమ్మం దిగుతూంటే జయ నీడలా నా వెనకే వచ్చింది. ఆమె తన సహజ ధోరణిలో, “జాగ్రత్తగా వెళ్ళిరండి, జేబులు భద్రం ఆ వచ్చేటప్పుడు కూరలు తేవడం మర్చిపోవద్దు” అంటూ పాత పాట వంతపాటగా పాడింది. “నాకు గుర్తేలే అన్నీ” అన్నాను రెండడుగులు వేసి.

“అది కాదండీ, వెడుతున్నది రాచకార్యం కాకపోయినా దాని అబ్బ లాంటిది కదా. అందుకూ చెప్పడం ఆ ఫణిభూషణం మామూలు రకం కాదుట. ఉద్దండ పిండంట వారితో మాట్లాడేడప్పుడు అనవసరపు టెన్షన్లు తెచ్చుకోవద్దు. ఇక వారితో మీ ఆదర్శాలూ, ఆశయాలు గట్రా మాట్లాడ్డం చెవిటి వాడి చెవిలో శంఖం పోసినట్టే. ఆయన తిక్‌స్కిన్డ్ మనిషని రవిగాడు చెప్పాడు.”

నేను జయవైపు చూశాను. నాతోపాటు తను పది ఇరవై అడుగులు జతకల్పింది గుర్తు చేయకపోతే – అదే మూడ్‌లో నాతో బస్ స్టాప్‌కి కాకుండా – ఫణి భూషణం ఇంటికే వచ్చేస్తుందనిపించింది అందుకే “చాలా దూరం వచ్చేశావు పోనీ నాతోబాటు” అని ఆగిపోయాను అప్పుడే జయ నాలిక కరుచుకుని వెనక్కి వెళ్లింది.

నేను ఎంత కాదనుకున్నా – నా నెత్తినో కొండని మోస్తూ సిటీ బస్ ఎక్కాననిపించింది. నిజమే ఫణిభూషణం దగ్గరకు నేనేం ఊసిపోక వెళ్లడం లేదు. వెడుతున్నది రవిగాడికి ఉద్యోగం వేయించమని అడగడానికి! ఆయన దయదలిస్తే ఎంతటి కరుడుగట్టిన నిరుద్యోగి అయినా కోటలో పాగా వేసినట్టే. ఆయన ఒట్టినే ఉపకారం చేయకపోవచ్చు. చేసే ఉపకారికి కొద్దిపాటి ముడుపులు చెల్లించవల్సి రావచ్చు. తప్పదు జయ అన్నట్టు మారే రోజులు,

మాయదారి రోజులు అవి విలువల్ని దారినుంచి కాస్త పక్కకి గెంటేయనూ వచ్చు ఏం చేయలేం.

నేను బస్‌దిగి ఫణిభూషణం గారి ఇంటివైపు నడిచాను ఆయన ఇంటిముందు, అరెకరం ఖాళీ ప్రదేశం తోటగా భాసిస్తుంటే వారుండే ఇల్లు – సుదూరంగా, ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే ముని పుంగవుడిలా వుంది. నేను వారి గేటు మీద చెయ్యి వేశానో లేదో నామీదకు వాచ్‌మెన్, వెను వెంటనే నాలుగు ఆల్సేషియన్లు విరుచుకు పడబోయాయి. అయితే వాచ్‌మెన్ నా భాషనూ, ఆపైన నా చేతిలోని రికమెండేషన్ ఉత్తరాన్నీ చూసి దయదల్చాడు. కానైతే వీరశునకాలు మాత్రం భోరున అల్లరి చేస్తూనే ఉన్నాయి. అప్పుడు వాచ్‌మెన్ తన భాషలో మాట్లాడి శునకాలకు నచ్చజెప్పాడు.

అలా పదినిముషాలు గడిచిన తర్వాత నేను లోపలికి వెళ్లగల్గాను. కేరళ దేశవాసి లారీ బేకర్ అనే ప్రముఖ ఆర్కిటెక్ట్ గారు ప్లాను చేసిన ఇల్లేమో అన్పించింది. అంత సహజ సుందరంగా ఉంది. నా చుట్టూ ఉన్న వస్తువుల్ని పరకాయించి చూశాను. ఆ పెద్ద హాల్లో ప్రతీ వస్తువూ తన ఖరీదుతో ఎదటి వస్తువును గేలిచేస్తున్నట్టుగానే ఉంది. కాళ్లక్రింద కాశ్మీరీ కార్పెట్, రూఫ్‌కు వేల్లాడుతున్న రష్యన్ చాండిలీర్‌ని నువ్వెంత అన్నట్టుగా రోజ్‌వుడ్ సోఫా, కిటికీలకు వేల్లాడే డోర్ కర్టెన్స్, నీవి వెనీషియన్ బ్లైండ్స్‌నీ మరి గొప్పలు పోకు అన్నట్టుగానూ, ఓమూల చెయ్యెత్తు అందగత్తెలా నుంచున్న స్టాండ్‌మీద గంగాళం లాంటి ఫ్లవర్ వాజ్ నాతో సరితూగ గలవారు ఎవరని సవాల్ చేస్తోన్నట్టుగానూ....

పది నిముషాల తర్వాత అతిధుల్ని ఆలస్యంగా కల్సుకోవడంలో మర్యాద చిహ్నం దాగి వుందన్నట్టుగా ఫణిభూషణం మేడమీద నుంచి దిగి వచ్చాడు. నేను నమస్కారం అని చెబితే – ఆయన జవాబు మాటలద్వారా చెప్పి, నోట్లోని మంచి ముత్యాలు ఖర్చు చేయడం ఇష్టంలేని వాడిలా – ఆ పని చేత్తో చేశాడు.

నేను వచ్చిన పని ఏమిటో చెప్పాను. నూటికీ తొంభై వంతులు జయ నూరిపోసిన మాటలు గబ గబా వల్లించాను. నేను చెప్పడం అయిన తర్వాత ఆయన నవ్వేసి, “మీ గురించి నాకు తెలుసు’ అనేసి, సోఫాలోంచి లేచి, చేతులు వెనక్కి కట్టుకుని, కిటికీతో మాట్లాడుతున్నట్టుగా, దాని తలుపుల్ని ఊపుతూ, “అది సరే మీ అబ్బాయి రవి ఉన్నాడు చూడండి” అన్నాడు.

“ఉన్నాడు” అన్నాను, నేను నమ్రతగా.

“అతను చాలా బ్రిలియంట్ అని విన్నాను.”

ఆ మాటలకు పొంగిపోవడం బాగుండదని “ఏదో చదివాడు” అన్నాను.

“మా తమ్ముడు భీమారావని, ఈ ఊళ్లోనే ఉంటున్నాడు వాడికి మీ రవి గురించి అంతా తెలుసు” అని ఆగి, ఆపైన మొహం నావైపు తిప్పి, మీద మీదకి వస్తూ “వాడి కూతుర్ని మీ ఇంట్లో కోడలిగా చెయ్యాలని ఆశ పడుతున్నాడు.”

నేను ఫణిభూషణాన్ని రాజకీయ నాయకుడనీ, పలుకుబడిగల మనిషనీ, వ్యాపార దక్షత తెలిసిన వాడనీ విన్నాను. కానీ ఇలా నా నడినెత్తిన, కాదు, మాడుమీద మూడోకాలు చటుక్కున వేయగల నేర్పరి అనుకోలేదు.

"చెప్పండి, మా భీమారావు కూతుర్ని చేసుకుంటే" అంటూ ఆయన, ఆయన తమ్ముడు గారూ మాకేం తవ్వి తలకెత్తబోతున్నదీ చెప్పాడు. నేను టీపాయ్ మీద పెట్టిన డబ్బు, తిరిగి నా జేబుల్లో పెట్టుకునే దాకా ఊరుకోలేదు. నా నిర్ణయం రెండు రోజుల్లో చెప్పమన్నాడు. ఏదో గుర్తుకు వచ్చి మేడమీదకు పోలి కేకలు పెట్టి షఢ్రుచులు మేళవించిన టిఫిన్లు తెప్పించాడు. చాలా పొద్దుపోయిన తర్వాత గానీ ఆయన నన్ను విడిచి పెట్టలేదు...

❖ ❖ ❖

ఒక దృష్టిలో చూస్తే ఫణిభూషణం యిచ్చిన ప్రపోజల్స్ తప్పుపట్ట వల్సిందేం లేదని పించింది. కానైతే అందులో కాస్తంత అవకాశ వాదం ఉంది – నిజమే! మనుషుల మధ్య ఇచ్చి పుచ్చుకునే ధోరణులువుండడం అభిలషనీయం అయినప్పుడు – ఆ వాదం సరి అయినదే అని ఒప్పుకున్నప్పుడు, ఇక విషయం లోతుకు వెళ్లి స్వార్థం గట్రా అంటూ చర్చించుకోవడం దండగేనేమో!!

నిజానికి ఈ విషయంలో రెండు రోజులు ఆలోచించవల్సిందేం లేదు. రెండు గంటల్లో ఏదో ఓ నిర్ణయానికి రావచ్చు. కానైతే, జయకూ, రవిగాడికీ ఆ అమ్మాయి నచ్చడం లాంటి చిన్న అవరోధాలు ఉన్నా వాటిని అధిగమించడం కష్టంకాదు. కానీ నా ఆలోచనలను ముల్లులా అంటి పెట్టుకుని ఉన్నది రవిగాడి సంగతే. వాడు కుముదిని అనే అమ్మాయిని ప్రేమించడం, ఆ అమ్మాయి తోడిదే తన జీవితం, అనడం.

అయితే జయ, రవిగాడి సంగతి చెప్పగానే, నేను ఏమీ పట్టనట్టు ఊరుకోలేదు. ఈకాలం కుర్రకారు సంగతి నాకు బాగా తెలుసు. వీధిలో నదురుగా కనబడ్డ అమ్మాయి తాలూకు చిత్ర పటం ఒకటి గీసేసుకుని, దాన్ని హృదయ కవాటాలకు, ఇట్టే వేళ్లాడదీసుకుంటారు!

అందుకే మంచికే, చెడుకో – రవిగాడి హృదయంలోంచి కుముదిని తొలగించడానికి నా ప్రయత్నాలు నేను చేశాను. మిత్రుడు రామలింగం సహాయంతో ప్లాను సెట్‌చేసి రంగం సిద్ధం చేశాను. కుముదిని రవిని అపార్థం చేసుకుంది. రవి అయోమయంలో జుట్టు పీక్కుంటూ విరహ గీతాలు పాడి పాడి అలసిపోతున్నాడు. ఇక చేయవల్సిందల్లా అనుకోకుండా వచ్చిన ఈ అవకాశంతో రవిగాడిని ఉద్యోగస్తుణ్ణి చేసి, ఆపైన ఇంటివాణ్ణి కానిచ్చేయడం!

గుమ్మం మెట్లు ఎక్కుతూ ఉంటే నాకు జయ ఎదురు వచ్చింది. "పండా, కాయా" అంటూ ప్రశ్నించింది. ఆమె వెనుక రవిగాడు టెన్షన్ కళ్లతో దోబూచులాడుతున్నాడు. "ఏమన్నాడు ఆ పెద్ద మనిషి" అడిగింది.

నేను జరిగిందంతా చెప్పి, "ఇదీ విషయం. నేను ఆయనతో చెప్పిందే మీ ఇద్దరితోనూ చెప్తున్నాను. ఇది మీ తల్లీ కొడుకులిద్దరూ కూర్చుని తేల్చుకోవల్సిన విషయం. మంచి ఉద్యోగం చేస్తున్న కొడుక్కీ, వాడి చెయ్యి పట్టుకుని మహాలక్ష్మిలా ఇంట్లో తిరిగే అమ్మాయికీ స్వాగతం చెప్పడమా, లేక రెండూ అవసరం లేదని తిరస్కరించడమా తేల్చుకోండి. కుముదినిని పెళ్లాడి, అదే స్వర్గం అనుకుంటూ నిరుద్యోగిగా బ్రతకడానికి వాడిష్టపడితే, అందుకు నువ్వూ వంత పాడతానంటే నేను కాదన్ను. నేను నిమిత్త మాత్రుణ్ణి. కానీ మీరు ఏదో సమాధానం రేపు సాయంకాలానికల్లా నాకు అందజేసి, పుణ్యం కట్టుకోండి, చాలు." అన్నాను.

"ఓ సమస్య పరిష్కారం చేసుకురమ్మంటే, కొత్త సమస్యని సృష్టి చేసుకుని వచ్చి, నాకేం పట్టనట్టు – ఇవేం మాటలండి." అంది బేజారయిన మనిషిలా జయ. నేను జవాబు చెప్పలేదు. అవును ఆ సమయంలో మాట్లాడకూడదు. చిక్కు ప్రశ్న క్విజ్ మాస్టర్ వేస్తాడు. సమాధానం చెప్పలేమని అన్నంత వరకూ క్విజ్ మాస్టర్ కలగజేసుకోవడం తప్పుకదా?

❖ ❖ ❖

రవీ నేనూ వెళ్లి ఫణిభూషణం గారి ఇంటివాకిట్లోకి ప్రవేశించే ముందు, తమ సహజధోరణిలో గేటు దగ్గరి వాచ్‌మెన్ ప్లస్ నాలుగు కుక్కలూ తిరిగి వాటి ప్రతాపం చూపించాయి. బంధుత్వపు హోదాతో మేమా ఇంటిలోకి ప్రవేశిస్తున్న సంగతి వాటికి తెలియదని నేను సరిపెట్టుకోవల్సి వచ్చింది. యధాప్రకారం వారి డ్రాయింగ్ రూమ్‌లో మేం కూర్చున్నాం. రవి, ఆ యింటి వాతావరణం చూసి తికమక అవుతున్నాడనీ, ఆపైన తన్మయత్వం చెందుతున్నాడనీ నాకన్పించింది.

పది నిముషాల్లో ఫణిభూషణం, వారి వెనుక మరో మనిషి మెట్లు విస విసా దిగుతూ వచ్చారు. వారి బూట్లు చేస్తూన్న చప్పుడు విని వారిద్దరూ కాస్త చిరాకుకు లోనయినట్టూ అది పరోక్షంగా ప్రదర్శిస్తున్నట్టూ నాకు చిన్న అనుమానం వేసింది. రెండో వ్యక్తి బహుశా భీమారావనీ నాకు కాబోయే వియ్యంకుడనీ ఎంత సరిపెట్టుకుందామన్నా మనసు కొద్దిగా మొరాయించడం మొదలు పెట్టింది. అవును మరి, పిల్ల నిస్తోన్నవాడు పాటించవల్సిన ప్రాథమిక సూత్రాలన్నీటినీ లెఖ్ఖచేసేది లేదన్న తత్వం వారి చూపుల్లో కన్పిస్తే – ఏమనుకోవాలి?

"వీడు మా అబ్బాయి. రవి. మీకు మొన్న చెప్పాను కదా, తీసుకు వచ్చాను."

"మీరు ఎందుకు వచ్చినట్టు?" భీమారావు అడిగాడు.

"మీరు మర్యాదస్తులనుకున్నాను. ఉద్యోగం కోసం మీరిలా మంచీ చెడూ గాలికి వదిలేసే రకాలనుకోలేదు. నేనసలే తిక్కమనిషిని. నా సంగతి మీకు పూర్తిగా తెలియదు" ఫణిభూషణం అన్నాడు.

"మీరు క్షమిస్తే వీరు మీ తమ్ముడు భీమారావు గారనుకుంటాను" అన్నాను, నేను.

"వాడే, వాడసలే అవమానంతో కాగిపోతున్నాడు. నేను మధ్యన ఉన్నాను కాబట్టి గానీ లేకపోతే వాడీ పాటికి మిమ్మల్ని నమిలి నంజుకు తినేశేవాడు తెలుసా."

"ఏమయిందండీ నాకేం అర్థం కావడం లేదు అయోమయం అంటారే అలాంటి అవస్థలోకి గెంటుతున్నాయి, మీ మాటలు. మీరు సూటిగా మాట్లాడితే విషయం అవగాహన చేసుకుని, నేనేదయినా చెప్పగలను అంతే గాని ఏకముఖంగా మీరు చిట్టా అవర్జాలు విప్పేస్తే" ఆగలేక అనేశాను.

"మీ అబ్బాయికి నేను ఉద్యోగం ఇప్పిస్తానన్నాను. అందుకు ప్రతిగా మా తమ్ముడి కూతుర్ని మీ కోడలిగా చేసుకోవాలి అంతే కదా."

"అవును అందుకు ఇష్టపడ్డ మూలంగానే కదా మేం వచ్చింది."

"చాల్లేవయ్యా చెబుతున్నావ్. మీ అబ్బాయి మా తమ్ముడి కూతుర్ని ప్రేమించి సవాలక్ష ప్రమాణాలు చేయడం, ఆ తర్వాత వేరే అమ్మాయితో స్నేహం చేసి దాని హృదయానికి కోత పెట్టడం మీకు తెలియకుండానే జరిగాయా. తెలిసీ మాతో సంబంధానికి వచ్చారంటే మిమ్మల్ని గుండెలు తీసిన బంటులనవద్దా?"

నేను రవి మొహం చూశాను. "భీమారావుగారి అమ్మయితో కూడా తిరిగి ఏడిశావా, ఏమిటి?" అంటూ నెమ్మదిగా మందలింపు మేళవించి అడిగాను.

"భీమారావు గారమ్మాయి ఎవరో నాకు తెలియదు నాన్నా నాకు తెలిసింది ఒకే అమ్మాయి కుముదిని. ఆ అమ్మాయిని మర్చిపొమ్మని మీరే చెప్పారుగా."

"తండ్రీ కొడుకులిద్దరూ ఏదో గూడు పూఠాణీ చేస్తున్నట్టున్నారు" భీమారావు కలగజేసుకుంటూ అన్నాడు.

"అదేం లేదు. కావాలంటే మా వాడ్ని క్రాస్ చెయ్యచ్చు."

"చాల్లెండి... నంగనాచి కబుర్లూ మీరూనూ... ఏమయ్యా మా అమ్మాయితో నీకు పరిచయం వుందా లేదా? అదీ నువ్వూ షికార్లు గట్రా చేశారా, లేదా? అది నీకేం అపకారం చేసిందని దాన్ని నట్టేట్లో ముంచాలని చూశావ్. నీకు నా కూతురు కన్నా ఆ రామలింగం గాడి కతురు ఎక్కువయ్యిందా? ఆస్తీపాస్తీ లేదు ఒట్టి ఉల్ఫారాయుడు."

రవిగాడు తలవంచుకుని,చేతులుపేర్చుకుని, ఓసారి ఇంటి రూఫ్ వైపు, మరోసారి నా వైపు చూసి - ఆఖరిగా భీమారావు గారి వైపు చూసి "ఎక్స్క్యూజ్ మి ఇంతకీ మీ అమ్మాయి ఎవరు? మధ్యలో వచ్చిన రామలింగం, వారి సుపుత్రికా ఎవరూ? కొంచెం అర్థమయినట్టు చెబితే"

"పేరు తెల్సుకుని ఏం చేస్తావ్ నాయనా? పేరు నీకు తెలియదా? ఆమెపేరుకూడా మర్చిపోయేటంత మారిపోయావన్నమాట"

సరిగ్గా అప్పుడే పక్కగది కర్టెన్ తొలగించుకుని ఓ చక్కని చుక్క, ముచ్చటగా

రెండడుగులువేసి, ఎవరో వెనక నుంచి డైరెక్షన్ యిచ్చినట్టు మూడో అడుగు దగ్గర మురిపాలు వలక బోసుకుందు కన్నట్టు ఆగిపోయింది!

రవిగాడు ఆ దృశ్యం చూసి విచలితుడైపోయినట్టు కన్పిస్తే నేను చెయ్యి పట్టుకుని ఆపాను. రవి చిన్నగా "ఈమె నా కుముదిని నాన్నా ఇక్కడికి ఎలా వచ్చింది. నాకంతా అయోమయంగా వుంది" అన్నాడు.

"అమ్మాయి కుముదినీ... తలెత్తి ఈ పిల్లగాణ్ణి చూడమ్మా ఈ అబ్బాయేనా నిన్ను ప్రేమించి, మోసం చేసింది, ఆ తర్వాత రామలింగం కూతురు వెంట బడ్డదీ. చెప్పు భయపడకు" ఫణిభూషణం అడుగుతున్నాడు.

కుముదిని మీద కోపంతో రామలింగాన్ని మధ్యవర్తిగా చేసి, ఆ పైన ఆయన కో కూతుర్ని సృష్టించి, ఆ విధంగా రవి గాడిని దారిలో పెట్టబోయిన నేను, ఫణిభూషణం గారి ఔదార్యం అందుకోలేక ఎలా దెబ్బతిన్నదీ తెలిసొచ్చింది.

ఆఖరి క్షణంలో ఎన్ని నిజాలు చెప్పినా, అవి కూడా అబద్ధాల పుట్టల్లోని పాములుగా మారుతయ్యనే భయంతో, విషమ పరిస్థితుల్లో మౌనం పాటించడం ఉత్తమం! కానీ అన్ని దారులూ మూసుకుపోయిన తర్వాతే నేరస్తుడు కూడా మౌనాన్నే ఆశ్రయిస్తాడని తిరిగి వాళ్ళేఅంటారు. ముందు గొయ్యి, వెనక నుయ్యి అంటే ఇదేనేమో?

ఇంతలో గెస్ట్‌రూమ్‌లోంచి హఠాత్తుగా రామలింగం రంగం మీదకు వస్తూ కన్పించాడు. వాడ్ని చూసి తలవాల్చుకోవల్సి వచ్చింది. వాడేమో భీమారావు పక్కన నిలబడి నన్ను వెక్కిరిస్తూ సౌంజ్ఞలు చేయడం కాకుండా కాసేపు గేలిచేసి, భీమారావు చెయ్యి నొక్కి "సుబ్బారావు, పాత కాలం మనిషి అంతా మర్చిపో, అన్నీ సజావుగా జరుగుతున్నాయిగా" అన్నాడు. అంతలో భీమారావు వెళ్ళి ఫణిభూషణం రెండు చేతులూ పుచ్చుకుని "నన్ను అపాయంలోంచి తప్పించారు. అడగ్గానే నా అండగా నిలబడి ఆ పైన అమోఘంగా నటించారు. మీ ఋణం తీర్చుకోలేనిది అలాగే మా అమ్మాయి కూడా నిరుత్సాహపడకుండా రామలింగం కూపి లాగి, ఆయన వెనకున్నది సుబ్బారావు గారని తెల్సుకుంది" అంటూ నమస్కారాలు అందజేశాడు.

ఫణిభూషణం చిన్నగా నవ్వేసి, "మాలాంటివాళ్ళు చేసిన ఉపకారాలు ఎవరు గుర్తుంచుకుంటారయ్యా పైగా మాకు ఉపకారబుద్ధి వుందని చెబితే వెక్కిరిస్తారు కూడా. మా బ్రతుకులిలాంటివి. రాజకీయ నాయకులు అపకారాలు చేశారని మన జనాన్ని ఈజీగా నమ్మించవచ్చు ఈ విషయాలన్నీ మర్చిపోదాం సరేనా" అన్నాడు.

అసలే సిగ్గుపడుతున్న నాకు వారి మాటలు మరింత ఇబ్బందిని కలగజేస్తూంటే కృతజ్ఞతలు చెప్పి, కాస్త పాపపరిహారం చేసుకుందామని ఫణిభూషణం గారి వైపు వెళ్ళాను.

❖